క్లుప్తంగా

ధనరాజులమ్మకు పూజలు



ధనరాజులమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా నింభాషిణి అమ్మవారి చల్లదనం



అమ్మవారి గుజముద్దను ఊరేగిస్తున్న భక్తులు

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామంలో నింభాషిణి అమ్మవారి చల్లదన ఉత్సవం గ్రామంలోని ఉపాధిహమీ వేతనదారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి గజముద్దను మేళతాళాలు, పగటి వేషాలతో ఊరేగింపు నిర్వహించారు. చల్లదన ఉత్సవంలో గ్రామస్తులు, వేతనదారులు పాల్గొన్నారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మొక్కలు నాటివేత



పలాసలో మొక్కలు నాటుతున్న జనసైనికులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ముత్యాలమ్మ కోనేరు వద్ద ఆదివారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అభిమానులు, యువనాయకులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎస్‌ఐ కోన కృష్ణారావు మాట్లాడుతూ.. జనసైనికులు, అభిమానులంతా జంటపట్టణాలను పచ్చదనంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చారని అన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు గిరీష్‌కుమార్, ప్రదీప్, పత్తి ఉదయ్, కిశోర్ యాదవ్, కిరణ్, సంకు శ్రీకాంత్, దీనబంధు పాత్రో, కార్తిక్, అజయ్, శ్రీనివాస్, హేమ, రఘు, కిరణ్, శ్రీకాంత్ ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామానికి చెందిన బద్రి వెంకటస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం సాయంత్రం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి క్రిష్ణారావు, స్థానిక పార్టీ నాయకుడు కప్పల యుగంధర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మద్దు సర్వేశ్వరరావు ఉన్నారు.

ఊడికలపాడులో సత్సంగం

కోటబొమ్మాళి: ఊడికలపాడు గ్రామంలోని శ్రీరామమందిరం వద్ద హిందూధర్మ ప్రచారకర్త సనపల కరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సత్సంగ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. విశాఖపట్నానికి చెందిన ప్రవచనకారుడు నిర్విషయానందస్వామి, ప్రకాశనంద స్వామి, బొత్స హరిప్రసాద్‌లు ప్రవచనాలను బోధించారు. మనిషికి సత్సంగం ద్వారా జ్ఞాన సముపార్జన చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాటమ్మతల్లికి పూజలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆదివారం జరిగిన ఆటో యూనియన్ సంబరాలలో ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అమ్మతల్లి ప్రతిమను ఆమె తలపై పెట్టుకుని మోశారు. అనంతరం సంపత్ వినాయక, బంకేశ్వరి ఆటో యూనియన్‌ల వద్ద దేవతామూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్, నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, మల్లా శ్రీనివాసరావు, అంబటి క్రిష్ణమూర్తి ఉన్నారు.

బిగొనపపుట్టుగలో పారిశుద్ధ పనులు

కవిటి: మండలంలోని బిగొనపపుట్టుగలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆదివారం చేపట్టారు. రోడ్లపై చెత్తను తొలగించి బ్లీచింగ్ జల్లారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న జంగిల్స్‌ను జేసీబీతో తొలగించారు. పనులను సర్పంచ్ బద్రి ప్రకాష్ పర్యవేక్షించారు.

ముందుకు‘సాగు’తున్న అన్నదాత



పొలం దున్నుతూ విత్తనాలు వేస్తున్న రైతులు



విత్తనాలు మోసుకోస్తున్న రైతన్న



జీవ ఎరువు జల్లుతూ..



గట్లు సరి చేస్తున్న మహిళ రైతు



సాగు పనుల్లో బిజీగా..

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు సైతం పడుతుండడంతో గంపెడాశతో అన్నదాత పంటలసాగుకు సన్నద్ధమయ్యాడు. పొలాలను దుక్కిచేసి వరి విత్తనాలు వేసేందుకు కావాల్సిన వనరులను సిద్ధం చేసుకునే పనుల్లో బిజీగా ఉన్నారు. కొంతమంది నారు మడులను సిద్ధం చేయడంతో పాటు వెద పద్ధతిలో సాగుకు విత్తనాలు జల్లుతున్నారు. అలాగే యంత్రాల సాయంతో ముమ్మరంగా దుక్కులు, గట్లు వేయడం, భూ సారాన్ని పెంచేందుకు జీవ ఎరువులను పొలంలో వేస్తూ ముందుకు‘సాగు’తున్నాడు. వర్షాలు పుష్కలంగా కురిసి..పంటలు బాగా పండాలని వరుణ దేవుడిని వేడుకుంటున్నాడు.

– వజ్రపుకొత్తూరు రూరల్

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోండి



ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అగ్రిగోల్డ్ ఏజెంట్లు

ఇచ్ఛాపురం రూరల్: పదేళ్ల నుంచి పరిష్కారానికి నోచుకోని అగ్రిగోల్డ్ బాధితులకు కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కలసి వినత పత్రం అందజేశారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించుటలో సమర్థ అధికారులతో స్పెసెల్ పర్సన్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేయించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులు అన్నింటిని సంరక్షించుటకు తగిన చర్యలు తీసుకోవాలని, కంపెనీ యజమానుల పేరుతో ఉన్న బినామీ ఆస్తులు, పలు రకాల యాజమాన్యం దాచుకున్న బినామీ ఆస్తులను స్వాధీన పరుచుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఇ.వి.నాయుడు, వి.తిరుపతి, ఎం.నాగేశ్వరరావు, జి.శేషగిరి, ఎస్.మల్లికార్జునరావు, బి.వి. చంద్రశేఖరరావు, పలువురు ఏజెంట్లు ఉన్నారు.

పలు కుటుంబాలకు ఎంపీపీ పరామర్శ



ఎంఈవో కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి, మృత్యుంజయం

కంచిలి: మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న ధనుంజయ మజ్జి తల్లి సీతారాణి మజ్జి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ పైలదేవదాస్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వజ్జమృత్యుంజయం తలతంపర సచివాలయం పరిధిలోని మజ్జిపుట్టుగ గ్రామానికి ఆదివారం వెళ్లి ఎంఈవో కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. అలాగే మజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన చంద్రు మజ్జి ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని కూడా ఎంపీపీ పరామర్శించారు. బెల్లుపడ గ్రామానికి చెందిన ఆయుదం కామేష్ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఎం.ఎస్ పల్లి గ్రామానికి చెందిన సూరిబాబు ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడ్డాడు. సూరిబాబును పరామర్శించారు. పార్టీ నాయకులు.. జేసీఎస్ కన్వీనర్ కొనపల సురేష్, సర్పంచ్‌లు జగబందు దొలాయి, కప్పల యుగంధర్, ఎంపీటీసీ సభ్యులు బృందావన్ సాహు, మొండ ప్రకాష్, బుడ్డెపు విశ్వనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు వెంకటరావు, నర్తు పోలారావు ఉన్నారు.

ఉత్సవాలకు మంచినీటి సరఫరా



నీటి సరఫరా ట్యాంకులను ప్రారంభిస్తున్న నాయకులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ గొల్లవీధిలో గ్రామదేవత ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేకంగా మంచినీటి సరఫరాకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, పట్టణ అధ్యక్షుడు కోళ లవకుమార్ ఆధ్వర్యంలో ట్యాంకర్లతో నీటి సరఫరాను ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరగనున్న గ్రామదేవత ఉత్సవాల నేపథ్యంలో ప్రతీ ఇంటికీ మంచినీరు సరఫరా చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మామిడి రాము, కోళ కామేష్, రెయ్యి ప్రీతీష్, దల్లి ప్రసాద్‌రెడ్డి, సోడిముడి కిరణ్, కోరాడ రామ్‌ప్రసాద్, కె.శ్రీను, శంకర్, మురళి, ప్రఫుల్ల, దోని బుజ్జి, ఎల్.దుర్గారావు, నందికేష్, ఎస్.గోపి పాల్గొన్నారు.

కనీస అవసరాలు ముఖ్యం




సదస్సులో మాట్లాడుతున్న విష్ణుమూర్తి

ఇచ్ఛాపురం రూరల్: గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కనీస అవసరాలైన కూడు, గూడు, విద్య, వైద్యం అనేవి ఎంతో అవసరమని స్వేచ్ఛా హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కూన విష్ణుమూర్తి అన్నారు. బెన్నుగానిపేటలో యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ ద్వారా స్థానిక ప్రజలతో కలసి అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. తమ ఆర్గనైజేషన్ ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను అందించడం జరుగుతోందన్నారు. మంచినీరు, విద్య, వైద్యం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ పూడి కిరణ్‌కుమార్, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు డి.హరిశ్చంద్ర, ఎం.సాయికృష్ణ, ఎ.విశ్వనాథం, సీహెచ్.రవికుమార్, సల్ల ప్రవీణ్, ఎస్.సంతోష్, బి.మనోజ్‌కుమార్, జి.బలరాం, ఆర్.రాము, అంబటి కుమారీ పాల్గొన్నారు.

కోర్టు భవనాల నిర్మాణాలకు చొరవ చూపండి

● మంత్రికి న్యాయవాదుల వినతి



అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో కోర్టు సముదాయాల భవనాలతో పాటు జడ్జి క్వార్టర్స్ నిర్మాణాలకు అవసరమైన పరిపాలనా అనుమతులు, నిధుల కేటాయింపులో చొరవ చూపాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి అచ్చెన్నాయుడుకు విన్నవించారు. నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో న్యాయవాదులంతా మర్యాద పూర్వకంగా అచ్చెన్నాయుడును ఆదివారం కలిశారు. టెక్కలిలో కోర్టు సముదాయాల కోసం కేటాయించిన స్థలంలో అనుకూలమైన నిర్మాణాలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వారంతా కోరారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, కార్యదర్శి ఎస్.దివాకర్, సభ్యులు డి.రాజేశ్వరరావు, పి.బాబూరావు, పి.అజయ్‌కుమార్, పి.సాయిరాజు, ఎ.వైకుంఠరావు, బి.శ్రీనివాసరావు, ఎస్.జగన్నాయకులు, పి.బలరాం, బి.మల్లేశ్వరరావు, పి.సింహాచలం, చిన్నారావు ఉన్నారు.

మంత్రిని కలిసిన అంగన్‌వాడీలు

కోటబొమ్మాళి: తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు కోరారు. ఈ మేరకు నిమ్మాడలో మంత్రి అచ్చెన్నాయుడుడు కలిసి వినతిపత్రం అందజేశారు. వీరితో పాటు సమగ్ర శిక్షా పరిధి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో పనిచేస్తున్న జిల్లా పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, డ్రాయింగ్, క్రాఫ్ట్, ఆరోగ్య విద్య బోధకులు కూడా మంత్రిని కలసి తమ సమస్యలు విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో అంగన్‌వాడీల సంఘ నాయకురాలు డి.సుధ, తదితరులు ఉన్నారు.

రిటైర్డు ఉద్యోగులకు సత్కారం



టెక్కలిలో: ప్రకాశరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు, అధ్యాపకులు



టెక్కలి: రమణమూర్తి దంపతులను సత్కరిస్తున్న డిపో మేనేజర్ తదితరులు



టెక్కలి: దామోదరరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



కాశీబుగ్గ: శార్వాణిని సత్కరిస్తున్న దృశ్యం



కంచిలి: తవిటయ్య దంపతుల్ని సన్మానిస్తున్న అధికారులు

టెక్కలి: విధి నిర్వాహణలో చేసిన సేవలే ఉద్యోగికి తగిన గుర్తింపునిస్తాయని విశ్రాంత ఆర్‌జేడీ పాత్రుని పాపారావు అన్నారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి(ఎఫ్ఏసీ) కోట ప్రకాశరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం టెక్కలిలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.కిరణ్‌కుమారి నేతృత్వంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యకు చెందిన వివిధ విభాగాల సిబ్బంది, విశ్రాంత అధికారులు, జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు హాజరై ప్రకాశరావు, వనజాక్షి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు, ఎస్.రుక్మాందరావు, ఎస్.తవిటినాయుడు, బి.శ్యామ్‌సుందర్, ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ, కె.తవిటినాయుడు ఉన్నారు.

ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్‌కు..

ఎంజేపీ పాఠశాల నిర్వాహణలో ప్రిన్సిపాల్ దామోదరరావును ఆదర్శంగా తీసుకోవాలని పలువురు కొనియాడారు. టెక్కలి ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన బోర దామోదరరావును పాఠశాల ఆవరణలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంజేపీ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు హాజరై దామోదరరావు, వాణీశ్వరి లక్ష్మీదేవి దంపతులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

టెక్కలి: ఉద్యోగిగా అంకితభావంతో చేసిన సేవలే తగిన గుర్తింపునిస్తాయని టెక్కలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ బీఎస్ఎన్ మూర్తిలు అన్నారు. డిపోలో సూపరింటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన గార వెంకటరమణమూర్తిని ఆదివారం సత్కరించారు. రమణమూర్తి దంపతులతో పాటు ఇదే రోజు ఉద్యో విరమణ చేసిన మరో ముగ్గురు ఉద్యోగులను యూనియన్ నాయకులు, డిపో సిబ్బంది సన్మానించారు.

కాశీబుగ్గ/పలాస: ప్రతీ ఉద్యోగి తాను పనిచేసిన ప్రాంతంలో చేసిన సేవలే మంచి గుర్తింపును తీసుకువస్తాయని ఆర్‌జేడీ చిన్మయిదేవి అన్నారు. కాశీబుగ్గ పాతజాతీయ రహదారిలోని టీకేఆర్ కల్యాణ మండపంలో కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ డి.శార్వాణి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆమెను సిబ్బంది ఘనంగా సత్కరించారు. సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, కార్యాలయం సిబ్బంది, ప్రత్యేక ప్రతినిధులు పాల్గొన్నారు.

కంచిలి: ఉత్తమమైన బోధనతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తమరాల సీతారామమూర్తి అన్నారు. మకరాంపురం గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి ఉద్యో విరమణ పొందిన పైల తవిటయ్య సన్మాన సభను పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుడు దుద్ది బాలరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తవిటయ్య దంపతుల్ని దుశ్శాలువతో సన్మానించారు. ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, స్థానిక నేతలు తమరాల శోభన్‌బాబు, ఏలుసూరి అప్పారావు, టి.వి.రమణ, విద్యాకమిటీ చైర్మన్ కె.కవిత, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎస్.సీతారాంనాయుడు, ఉపాధ్యాయుడు వజ్జ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజులోనే పింఛన్ల పంపిణీకి చర్యలు

కవిటి: మండలంలోని 22 గ్రామసచివాలయాల పరిధిలో సోమవారం ఒక్కరోజులోనే శతశాతం సంక్షేమ పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ శివాజీ పాణిగ్రాహి తెలిపారు. ఈ మేరకు వివిధ సచివాలయాల్లో పింఛన్‌దారులకు సీఎం చంద్రబాబు సందేశంతో ఉన్న కరపత్రాలు పంపిణీ చేసేందుకు వీలుగా కార్యదర్శులకు వీటిని ఆదివారం అందజేశారు. ఈ నెలలో మండలంలోని 22 సచివాలయాల పరిధిలో 11,600 మంది లబ్ధిదారులకు రూ. 7,87,19,500 నిధులు మంజూరైనట్టు ఎంపీడీవో తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ప్రజాప్రతినిధులు, నేతల్ని సమన్వయం చేసుకుని పంపిణీ ప్రక్రియను చేపట్టాలని సూచించారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు!



రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో స్థానిక మెళియాపుట్టి రోడ్ జంక్షన్ చెరువును తలపిస్తోంది. చిన్నపాటి వర్షం పడితే చాలు వరద నీరంతా నిల్వగా చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గతంలో ఇటువంటి పరిస్థితి ఉండేది కాదు. ఇదే ప్రాంతంలో వరద నీరు ప్రవహించేందుకు అనుకూలంగా కాలువలు ఉండేవి. ప్రస్తుతం అవి ఆక్రమణలకు గురి కావడంతో ఆ ప్రభావం వలన వర్షం నీరంతా ఇలా రోడ్డుపై నిల్వగా చేరి చెరువుగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పింఛన్ల పంపిణీలో వీవోఏలు భాగస్వాములు కావాలి

ఇచ్ఛాపురం రూరల్: ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టనున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో వీవోఏలు భాగస్వాములు కావాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం వీవోఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన వారికి సక్రమంగా పింఛన్లు అందజేశారా లేదా, లబ్ధిదారులకు సీఎం విడుదల చేసిన కర పత్రాలు పంపిణీ జరిగిందా, లేదా అన్నది పరిశీలించాలని అన్నారు. ఎంపీడీవో వైవీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీలో అలసత్వం లేకుండా సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని, సిబ్బంది లేని గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని అన్నారు.

108 అంబులెన్సు సర్వీస్‌లు ప్రభుత్వమే నిర్వహించాలి

కాశీబుగ్గ: ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న 108 అంబులెన్సు సర్వీస్‌లను ప్రభుత్వమే నడిపించాలని సిబ్బంది కోరారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను 108 అంబులెన్సు సిబ్బంది ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈఎంటీ, పైలట్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పని వేళలు సరిచేయాలని, ఉద్యోగులు, వాహనాలకు షెల్టర్లు నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎన్.వెంకటరావు, వి.మురళీమోహనరావు, బి.తారకేశ్వరరావు, బి.రవికుమార్, ఎన్.ఆనందరావు, ఎ.నారాయణరావు ఉన్నారు.

కూటమి నేతలకు పాలాభిషేకం

సంతబొమ్మాళి: ఎన్డీఏ కూటమి నేతలైన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు చిత్రపటాలకు మేఘవరం సచివాలయం వద్ద టీడీపీ నాయకులు ఆదివారం పాలాభిషేకం చేసి సందడి చేశారు. ఎన్నికల హామీల్లో భాగంగా పింఛన్ పెంపు జూలై నెల నుంచి అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైఎస్ ఎంపీపీ సూరాడ భీమారావు, మాజీ సర్పంచ్ వంక సోమేశ్వరరావు, సూరాడ రాయుడు, దీర్ఘాశి జయరాంరెడ్డి, పి.వినోద్ ఉన్నారు.

పవన్ కృషితోనే కూటమి ఏర్పాటు

కాశీబుగ్గ: ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషితోనే ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి విజయానికి కారణం అయ్యిందని జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. పలాస రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం జరిగిన జనసేన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు డొక్కరి శంకరరావు, సప్ప నవీన్, బడ్డ నాగరాజు, టంకాల రవిశంకర్ గుప్తా, దేవా, అశోక్, రాము, కేదార్, మోహన్, కార్తిక్, చిన్ని, చైతన్య పాల్గొన్నారు.

కామ్రేడ్ ఓంకార్ మృతి తీరనిలోటు



ఓంకార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు

టెక్కలి: ఉపాధ్యాయ సంఘాల నాయకుడు, ప్రజా నాట్య మండలి కళాకారుడు బత్తిని ఓంకార్ మృతి ఆయా సంఘాలకు తీరని లోటు అని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం టెక్కలిలో ఓంకార్ సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.వైకుంఠరావు, కె.బాలయ్య, పి.ధర్మారావు, విజయ్‌కుమార్, ఎన్.షణ్ముఖరావు, బి.వాసుదేవరావు, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, దుర్గారావు ఉన్నారు.